
# కొత్త ఉద్యమాలు పాత సిద్ధాంతాలు



కె. బాలగోపాల్

ఈ మధ్య కాలంలో మన రాష్ట్రంలో కొన్ని ఉద్యమాలు ముందుకొచ్చాయి. వాటిని 'అస్తిత్వ ఉద్యమాలు', 'గుర్తింపు రాజకీయాలు' అని విశ్లేషకులు పిలుస్తున్నారు. ఈ పేర్లు ఆ ఉద్యమాలు తమకు తాము పెట్టుకున్నవి కావు. విశ్లేషకులు పెట్టినవి. Politics of Identity అనే ఇంగ్లీష్ ప్రయోగానికి అనువాదంగా ఈ పేర్లు వచ్చినట్లున్నాయి. కానీ ఆ ఇంగ్లీష్ ప్రయోగమైనా, ఈ తెలుగు అనువాదమైనా ఆ ఉద్యమాలన్నిటి స్వభావాన్నీ సరిగ్గా వ్యక్తం చేస్తాయా అంటే సందేహమే.

ఒక ప్రత్యేకమైన సాంఘిక సాంస్కృతిక స్వభావంగల ప్రజలు తమ ప్రత్యేకతను కాపాడుకోవడం కోసం చేసే ఉద్యమాలకు ఆపేరు పెట్టవచ్చును. ఉదాహరణకు బ్రిటన్ లో ఐరిష్ ప్రజల పోరాటం. ఈశాన్య భారతప్రాంతంలోని నాగా తదితర జాతుల పోరాటాలకు, కాశ్మీర్ పోరాటానికి ఈ పేరు చాలా వరకు సరిపోతుంది. ఆ అర్థంలో మన దగ్గర కొత్తగా ముందుకొచ్చిన ఉద్యమాలేవీ అస్తిత్వ ఉద్యమాలు - ఐడెంటిటీ స్ట్రగుల్స్ - కావు. వాటికి ప్రాతిపదిక అయిన ప్రజలకు- స్త్రీలు, దళితులు, ఆదివాసీలు, మాదిగలు- ఒక ప్రత్యేకమైన సాంఘిక సాంస్కృతిక ఉనికి ఉన్న మాటసత్యం. ఆ ఉనికి వారి ఆకాంక్షలకు మూలం. ఆ ఉనికి అందిచ్చిన గొంతులో ఆ ఆకాంక్షలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఆ ఉనికిని వ్యక్తం చేయడమే వారి ఆకాంక్ష కాదు.అందులోని అణిచివేతనూ అసమానతనూ అధిగమించడం వారి ఆకాంక్ష. ఎటొచ్చీ దానికి కావలసిన శక్తినీ దృష్టినీ ఆ ప్రజలు తమ ఉనికి నుండపొందుతున్నా దానినిసిద్ధాంతీకరిస్తున్నారు. ఈ పరిమితమైన అర్థంలో వారిపోరాటాలను 'అస్తిత్వ పోరాటాలు' అంటున్నారు. కానీ వాటి స్వభావాన్నీ విముక్తి కాంక్షనూ ఆ పేరు స్ఫురింపచేయదు.

కొన్ని పోరాటాలలో ప్రత్యేకమైనఉనికిని- తమ అస్తిత్వాన్నినిర్వచించేవిశిష్టతను- కాపాడుకునేఆకాంక్ష కొంత ఉన్నమాటవాస్తవమే. ఉదాహరణగాతెలంగాణ ఉద్యమాన్ని తీసుకోవచ్చును.భాషాసంస్కృతులకు తెలంగాణాకు ఉన్న విశిష్టత ఉమ్మడి 'తెలుగుతనం' అనే ఆధిపత్య భావనలో మునిగిపోయి తన ప్రత్యేకతను కోల్పోకుండా ఉండాలన్న ఆరాటం తెలంగాణ ఉద్యమంలో ఉంది. కానీ అదొక్కటే దానికి ప్రేరణ కాదు. సాగునీటి నుండి విద్యవరకు వివిధ రంగాలలో తెలంగాణకు జరిగిన అన్యాయం ఉంది. అది తెలంగాణ ఉద్యమానికి ఒక ముఖ్యప్రేరణ. వీటిలో ఏది అన్నిటికంటె ముఖ్యమైన ప్రేరణ అనే చర్చ ప్రస్తుతానికి అనవసరం గానీ అది కేవలం 'అస్తిత్వ పోరాటం' కాదు, 'గుర్తింపు రాజకీయం' కాదు. ఏజెన్సీ ఆదివాసీల పోరాటంలో కూడా ఆదివాసీల జీవన శైలికి సంబంధించిన ఆరాటం ఉంది. ప్రకృతితో వైరిసంబంధం ఉన్న పెట్టుబడిదారీ జీవనశైలికీ, ప్రకృతితో స్నేహసంబంధం ఉన్న ఆదివాసీ జీవన శైలికీ మధ్యనున్న వైరుధ్యం ఆ పోరాటంలో ఒక అంశమే. అయితే దానితోబాటు భూమి పరాయీకరణ, సంక్షేమ చట్టాల అమలులోని వైఫల్యం, విద్యావకాశాలు మొదలయిన అంశాలూ ఉన్నాయి. అది పాక్షికంగా మాత్రమే 'అస్తిత్వ పోరాటం'.

తక్కిన కొత్త ఉద్యమాలలో 'అస్తిత్వ పోరాటం' లక్షణం ఈమాత్రం కూడ లేవు. అన్నీ కూడ సాంఘిక ఆర్థిక రాజకీయ వివక్షకూ, అసమానతకూ, అణిచివేతకూ వ్యతిరేకంగా ముందుకొచ్చిన పోరాటాలే. అన్నీ మన సామాజిక వ్యవస్థలోని ఏదో ఒక ప్రత్యేకమైన స్థానం గల ప్రజాసమూహం జీవిత అనుభవం నుండి , ఆకాంక్షలనుండి, పుట్టిన మాట వాస్తవమే. ఆ అనుభవం నుండి పుట్టిన ప్రత్యేక దృక్కోణం కలిగిన పోరాటాలనేది కూడ వాస్తవమే. కానీ వాటి ఆ అనుభవ ప్రత్యేకతను వ్యక్తం చేయడం, నిలబెట్టుకోవడం లేక కాపాడుకోవడం మాత్రమే కాదు (తెలంగాణ ఉద్యమంలోనూ ఆదివాసీల ఏజెన్సీ పోరాటంలోనూ ఆ లక్ష్యం కొంతమేరకు ఉన్నప్పటికీ). ఆ జీవిత అనుభవంలోని అణిచివేతనూ అసమానతనూ అధిగమించి సమానత్వాన్నీ అణచివేత లేని జీవితాన్నీ (కనీసం ఆ మేరకు)సాధించాలనే ఆకాంక్ష వాటి లక్ష్యంలో ఒక అంశం.

కేవలం తమ చారిత్రక సాంస్కృతిక ప్రత్యేకతనూ, విశిష్టతనూ నిలబెట్టుకోవాలనే ఆకాంక్ష, ఆ కళ్ళతో చూసినప్పుడు కనిపించే సత్యాన్ని వ్యక్తం చేయాలనే ఆరాటం, ఉండదనీ, ఉండకూడదనీ నా ఉద్దేశ్యం కాదు. అటువంటి ఆకాంక్షనూ, ఆరాటాన్నీ సానుభూతితోచూడకూడదనీ సమర్థించకూడదనీ అసలే కాదు. కాశ్మీర్ పోరాటం ప్రధానంగా ఆ కోవకు చెందినదే. అది పూర్తిగా సమర్థనీయమైన పోరాటం. అయితే మన రాష్ట్రంలో 'అస్తిత్వ పోరాటాలు', 'గుర్తింపు రాజకీయాలు' అనే పేరుతో పిలువబడుతున్నవేవీ (పూర్తిగా) ఆ కోవకు చెందినవి కావు. సాంఘిక ఆర్థిక అణచివేతకంటే జీవిత అనుభవం లోనూ జీవన విధానంలో ఉన్న విశిష్టతకూ, సత్యాసత్యాలకంటే దృక్కోణంలోని ప్రత్యేకతకూ అన్ని సందర్భాలలోనూ ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలనే వైఖరి పోస్ట్-మోడరన్ తాత్విక ధోరణి నుండి వచ్చినది. వీటి ప్రాముఖ్యాన్ని బాగా తక్కువ చేసే సంప్రదాయక వామపక్ష ధోరణికి అది అందిచ్చే సవరణ అవసరమే. కానీ దానిని నిర్విమర్శగా స్వీకరించనవసరం లేదు. ఒకొక్క ఉద్యమానికి ఉన్న వాస్తవ స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. అన్ని పోరాటాలనూ ఆర్థిక సంబంధాలకు కుదించడం ఎంత తప్పో అన్నిటినీ అస్తిత్వప్రత్యేకతకూ అనుభవ విశిష్టతకూ కుదించివేయడం అంతే తప్పు.


మరి ఆంధ్రప్రదేశ్‌లో ఈ మధ్య కొత్తగా ముందుకొచ్చిన ఉద్యమాలను ఏవిధంగా అర్థం చేసుకోవాలి ? వాటికన్నిటికీ ఏదో ఒకే పేరు పెట్టగలుగుతామని నేను అనుకోను.నెగటివ్‌గా వాటిని 'వర్గేతర' రాజకీయాలు అనవచ్చును. అవి మనకు 'కొత్తవి' గాకనిపించడానికి కారణం ఇక్కడే ఉందేమో. వర్గరాజకీయాలే శాస్త్రీయమైన రాజకీయాలనీ తక్కినవన్నీ తప్పుడు అవగాహన నుండి (వాటి వెనుక ఉన్న ఆరాటం ఎంత న్యాయమైనదైనా) పుట్టినవనీ దాదాపు మూడు తరాలుగా తెలుగునాట అభ్యుదయవాదులు (మెజార్టీగా) నమ్ముతున్నారు. అది నిజం కానవసరం లేదని మనకు నేర్పడమే (కనీసం సందేహం

కల్గించడం) ఈ ఉద్యమాలలోని నవ్యత. అందుకే అవి మనకు 'కొత్తవి'గా కనిపిస్తున్నాయి. లేకపోతే వాటిలో కొత్తదనమేమీ లేదు. ఆదివాసీలు రామాయణ కాలం నుండి మైదాన ప్రాంతాలవారి చొరబాటుకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారు. ఆ పోరాటం జీలుగుమిల్లిలో మొదలు కాలేదు. శూద్రులు బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా వర్ణవ్యవస్థ పుట్టినప్పటి నుండి పోరాటాలు చేస్తున్నారనడానికి చారిత్రక ఆధారాలున్నాయి. స్త్రీలు ప్రతీయింట్లోనూ మగపెత్తనానికి వ్యతిరేకంగా నాగరికత పుట్టినప్పటినుండి ఘర్షణ పడుతూనే ఉన్నారు. ఈ పోరాటాలన్నీ మనకు 'కొత్తవి' గా కనిపించడానికి కారణం మనకు అవి నేర్పుతున్న కొత్త సిద్ధాంత దృక్పథం.

దీనిని కొంచెం వివరంగా చూద్దాం.

1985 తరువాత మన రాష్ట్రంలో కొత్త సమస్యలపైన ముందుకొచ్చిన ఉద్యమాలలో అత్యధిక భాగం ఏ రాజకీయపార్టీ నాయకత్వాన (సిపిఐ- ఎంఎల్ పార్టీలతో సహా)రాలేదు. (పాత ఉద్యమాలు కొత్త ప్రాంతాలకు విస్తరించి ఉండవచ్చునుగాక). దీనికి రెండు మినహాయింపులు రాయలసీమ జిల్లాల్లో సాయుధ ముఠాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వచ్చిన ఆందోళన, జైలు ఖైదీల హక్కుల పోరాటం. ఇవి రెండూ మార్క్సిస్ట్-లెనినిస్టుల ప్రేరణతో వచ్చాయి. కానీ ఇవి మినహాయింపులు మాత్రమే. 1985లో దళిత మహాసభ ఆవిర్భావంతో మొదలుపెట్టి, సిద్ధాంత తాత్వికరంగాలలో దళిత మేధావులు, ఫెమినిస్టులూ చేపట్టిన చర్చ, ప్రచారమాధ్యమాలు, సారా వ్యతిరేక మహిళా పోరాటం, ఏజెన్సీలో ఆదివాసీల 1ఆఫ్ 70 పోరాటం, మాదిగ హక్కుల పోరాటం, కోయల తుడుండెబ్బ, తెలంగాణ ఉద్యమం మొదలగునవన్నీ రాజకీయ పార్టీ వ్యవస్థకు వెలుపల వచ్చిన ఉద్యమాలే.

**విభినజీవిత అనుభవాలలోనూ అసమానతలలోనూ నిజంగానే భిన్నత్వం, వైవిధ్యం ఉంటుందని గుర్తించినట్టయితే, 'ప్రజలనుండి నేర్చుకోవడం' అనేదిఅనివార్యంగా సంఘర్షణాత్మకంగా ఉంటుందని అర్థం అవుతుంది.**



ఇవన్నీ వర్గేతర రాజకీయ సమీకరణలేనన్న 'కొత్తదనం' (అంటే ఇప్పటివరకు ఉన్న రాజకీయ కామన్ సెన్స్‌కు కొత్తగా తోచే లక్షణం) మాత్రమే కాక, ఈ ఉద్యమాలను ఏ రాజకీయపార్టీ మొదలుపెట్టలేదనే కొత్తదనం కూడ వీటిలో ఉంది. సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి, సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత ప్రజలను సమీకరించే శాస్త్రీయ దృక్పథంగల రాజకీయపార్టీ నాయకత్వాన మాత్రమే ప్రగతి నిర్దుష్టంగా సాధ్యం అవుతుందనేది వామపక్ష రాజకీయాలలో ప్రబలంగా ఉన్న ఆలోచన. ఎక్కడన్నా ఒకటీ అరా ఉద్యమాలు తమంతటతాము ఆవిర్భవించినా, శాస్త్రీయ దృక్పథంగల రాజకీయ పార్టీ వెనువెంటనే స్పందించి దానిని తన చేతిలోనికి తీసుకొని దానికి సమగ్రమైన ప్రాపంచిక దృక్పథం నేర్పించి నడిపించాలనీ, నడిపిస్తుందనీ, అది జరిగినప్పుడే ఆ ఉద్యమం నిజమైన అర్థంలో ప్రగతిపథంలోకి వస్తుందనీ వామపక్ష దృక్పథం నమ్ముతూ వచ్చింది. ఉద్యమ పురోగమన క్రమం ఈవిధంగానే ఉంటుందనీ, అంతకంటే భిన్నంగా ఎక్కడయినా జరిగితే ఆ ఉద్యమక్రమం లోపభూయిష్టమయినదనీ వామపక్షవాదులు నమ్ముతూ వచ్చారు.

ఈ కొత్త ఉద్యమాలు ఒక కొత్త పురోగమన క్రమాన్ని మన ముందుంచాయి. అణచివేత, అసమానత, రకరకాల రూపాలలో ఉంటాయి. వాటినన్నిటినీ సైద్ధాంతికంగా ఆకళింపుచేసుకొని అన్నిటికి వ్యతిరేకంగానూ ఉద్యమాలను ఒకేతాటిన నిర్మించగల రాజకీయపార్టీ ఒకటి ఉండడం కష్టమే. పార్టీలు నమ్మే రాజకీయ సిద్ధాంతాలు తమ దృక్పథాన్ని సార్వజనీన సూత్రాల రూపంలో ప్రకటించవచ్చునుగానీ వాటి వెనుకనున్న జీవిత అనుభవం సార్వజనీనం కాదు. అది అప్పటికి చరిత్రలో ముందుకొచ్చిన -అంటే రాజకీయంగా తనను తాను వ్యక్తం చేసుకున్న అనుభవం మాత్రమే. 'కొత్త అనుభవాన్ని ప్రజలనుండి నేర్చుకుంటాం' అని ఆ పార్టీ అనవచ్చును. నిజాయితీగానే నమ్మవచ్చును. కానీ ఆ కొత్త అనుభవం నిజానికి పాత అనుభవానికి కొన్ని కొత్త వివరాలను చేర్చే కొనసాగింపు మాత్రమే అయినప్పుడు తప్ప 'నేర్చుకోవడం', 'నేర్చుకొని దానికి శాస్త్రీయ రూపం ఇచ్చి ప్రజలకు అందియ్యడం' సులభంగా జరగదు. విభిన్న జీవిత అనుభవాలలోనూ అసమానతలలోనూ నిజంగానే భిన్నత్వం, వైవిధ్యం ఉంటుందని గుర్తించినట్టయితే, 'ప్రజలనుండి నేర్చుకోవడం' అనేదిఅనివార్యంగా సంఘర్షణాత్మకంగా ఉంటుందని అర్థం అవుతుంది. కొత్త జ్ఞానం పాత జ్ఞానాన్ని సవాలు చేస్తుంది. పాత జ్ఞానం కొత్త జ్ఞానాన్ని సులభంగా ఆకళింపు చేసుకొని ఆ కొత్త ప్రజలతో సులభంగా మమేకమై వారి ఆకాంక్షలకు తన దగ్గరున్న 'శాస్త్రీయ ప్రాపంచిక దృక్పథాన్ని' అందివ్వడం జరగదు. అంటే పైన వివరించిన ఉద్యమ పురోగమనక్రమం సందేహాస్పదమైనది.

మరి ఈ ఉద్యమాలు నేర్పే ప్రత్యామ్నాయం ఏమిటి ? ఆయా జీవిత రంగాలలో అణచివేతకూ అసమానతకూ గురయ్యే ప్రజల జీవిత అనుభవం నుండి ఉద్యమాలు పుట్టడం, ఆ ప్రజలను సమీకరించే లక్ష్యంతో ఉద్యమ సంస్థలు పుట్టి పోరాటాలు నిర్వహించడం అత్యంత ప్రాథమికమైన క్రమం. పోరాటాలను ప్రజలతో సమానం చేసి చూడడంలో ఉన్న ఇబ్బందిని పక్కనపెట్టి మామూలుగా అలవాటయిన (అతిశయోక్తితో కూడుకున్న) భాషలో చెప్పాలంటే, ఇవి ఆ ప్రజలు తమకోసం తాము చేసుకునే పోరాటాలు. (అయితే తమ ఉనికిలోని ప్రత్యేకతను నిలబెట్టుకునే పోరాటం- అంటే అస్తిత్వ పోరాటం- కావచ్చును. కాకపోవచ్చును. పాక్షికంగా కావచ్చును). ఇటువంటి భిన్నమైన పోరాటాలు ప్రగతి గురించి, అభ్యుదయాన్ని గురించి కొత్త ఆలోచనలను తీసుకొస్తాయి. పాత సమాజం మీద కొత్త కోణం నుండి విమర్శ పెడతాయి. అంతేకాదు, అప్పటివరకు గుర్తింపు పొందిఉన్న అభ్యుదయ భావనపై కూడ విమర్శ పెడతాయి. దానికి సరళంగా 'నేర్పించవు'. అది సరళంగా 'నేర్చుకోదు'. సంఘర్షణ జరుగుతుంది.

సంఘర్షణాత్మకంగానే ఇరువక్షాలూ నేర్చుకుంటాయి. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే మరీ ఎక్కువ విధ్వంసం లేకుండా నేర్చుకోవడం జరుగుతుంది. లేకపోయినా నేర్చుకోవడం మాత్రం జరుగుతుంది. ఈ విధంగా ఉద్యమాలలోనూ ఉద్యమ సిద్ధాంతాలలోనూ వచ్చే మార్పుల సమాహారమే ప్రగతి. ప్రగతిశీలక ప్రాపంచిక దృక్పథం. ఇది ఉద్యమాల పురోగమన క్రమమే తప్ప 'ఉద్యమ పురోగమన క్రమం' కాదు. ఉద్యమం అని ఏకవచనంలో అనడం కమ్యూనిస్టు సంప్రదాయంలో ఎంత సహజమో, ఉద్యమాలు అని బహువచనంలో అనడం ఈ కొత్త ఉద్యమాలు నేర్పిస్తున్న దృక్పథంలో అంత సహజం.

గత దశాబ్దకాలంగా ఆంధ్రప్రదేశ్‌లో ముందుకొచ్చిన కొత్త ఉద్యమాలనూ వాటితో కమ్యూనిస్టు పార్టీలకూ, మేధావులకూ ఉన్న సంబంధాన్నీ పరీక్షిస్తే, ఈ రెండవ పురోగమన క్రమమే సహజం అనే వాదనకు బలం చేకూరుతుంది. (లేదంటే, ప్రస్తుతం నడుస్తున్న చారిత్రక దశే గాడి తప్పిన దశఅనీ- అది గడచి చరిత్ర గాడిమీదకి వచ్చేదాకా వేచి వుండాలి తప్ప గాడి తప్పిన చరిత్రను సిద్ధాంతీకరించ కూడదనీ అనుకోవలసి ఉంటుంది). ఎందుకంటే ఈ ఉద్యమాలు ముందుకు తీసుకొచ్చిన సమస్యలు, అరాటాలూ, ఆకాంక్షలూ సమాజంలో ఉన్నాయన్న ఎరుకే కమ్యూనిస్టు పార్టీలకూ మేధావులకూ- అత్యంత క్రియాశీలక స్వభావంగల వారిగా తమ గురించి తాము భావించే మార్క్సిస్టు-లెనినిస్టులతో సహా ఉండలేదు. ఉదాహరణకు కోస్తా ఆంధ్ర జిల్లాలో ఇప్పట్లో 'ఉద్యమం' రావడం సాధ్యంకాదని ఎం-ఎల్ పార్టీలూ ఆ పార్టీలకు సన్నిహితులయిన మేధావులూ (నాతో సహా) కారంచేడు జరిగేదాకా నమ్ముతూ వచ్చారు. తెగించి వ్యాసాలు రాసారు కూడ. ఒక్కొక్క విషయంలోనూ ఆ సమస్యను అనుభవించి దానిని ప్రతిఘటించే చైతన్యం, దానిని అంతమొందించాలన్న ఆరాటం పెంచుకున్న ప్రజలే కళ్ళు తెరిపించవలసి వచ్చింది.


ఆ తరువాత కూడ- సిద్ధాంత ప్రకారం జరుగవలసి ఉన్నట్టు- ఆ ఉద్యమాలను కమ్యూనిస్టులు తమ చేతిలోకి తీసుకొని వాటి 'తప్పుడు చైతన్యాన్ని' సవరించి వాటిని 'సరయిన దారిలో' నడిపించడం జరగలేదు. ఎక్కువ భాగం పరస్పర అనుమానంతోనే గడిచింది. కొంత కాలం తరువాత సంఘీభావం తెలపడం, ఐక్యఉద్యమాలలో భాగం పంచుకోవడం జరుగుతూ వచ్చింది. అయినప్పటికీ సందేహాలూ, విమర్శలూ, విభేదాలూ, కొనసాగుతూనే ఉన్నాయి. విభేదమే ప్రధానంగా ఉండి ఎత్తుగడల మేరకు మాత్రమే ఐక్యత ఉందంటే అతిశయోక్తి కాదు.

వామపక్ష పార్టీలు ఈ కొత్త ఆరాటాలనూ, ఆకాంక్షలనూ చూడలేక పోవడానికి గల ఒక కారణం ఇప్పటికే బాగా చర్చకు వచ్చింది. అదేమిటంటే ఆ పార్టీల నాయకులూ మేధావులూ ఒక పరిమితమైన (అందులోనూ ఆధిపత్య స్వభావం గల) జీవిత అనుభవం నుండి వచ్చిన వారన్న వాస్తవం. తాగివచ్చిన మొగుడి చేతిలో తన్నులు తిన్న అనుభవం ఉన్న స్త్రీలెవరూ నాయకత్వ స్థానంలో లేని పార్టీలు సారా వ్యతిరేక మహిళా పోరాటాన్ని ఊహించగలవా ? వాళ్ళు నిర్మించిన పోరాటం అందుకనే మగ మిలిటెంట్ల మెరుపుదాడుల పోరాటంగానో లేక పార్టీల నిర్మాణంలోని అత్యంత బలహీన విభాగమైన మహిళా సంఘాల ఆందోళనగానో ఉండిపోయింది. అంటరాని తనాన్ని తమ జీవితంలో అనుభవించిన వారెవ్వరూ నాయకత్వ స్థానంలో లేని పార్టీలు - ఆ అనుభవం స్వయంగా ఎరుగని మేధావులు దళితులలో ఆత్మగౌరవ ఆకాంక్ష; సాంఘిక సమానత్వ ఆకాంక్ష ఎంత బలంగా ఉన్నాయో అర్థం చేసుకోగలరా ? అందుకే వెట్టిచాకిరీ వంటి మధ్య యుగాల దోపిడీ రూపాలు అంతమైన సర్కార్ జిల్లాలో ప్రజాతంత్ర పోరాటాలకు పెద్దగా ఆస్కారం లేదని అనుకున్నాము. ఇవి న్యాయమైన ప్రశ్నలే. సిద్ధాంతం కేవలం తర్కానిక సంబంధించిన విషయం కాదు. సిద్ధాంతం అన్వయం కేవలం తార్కిక శక్తికీ, విషయ పరిజ్ఞానాన్ని బయటినుండి స్వీకరించడంలో ఉండే సామర్థ్యానికీ సంబంధించిన విషయంకాదు.

ఆ రెండింటితో బాటు (అవి అనవసరం అని కాదు) జీవిత అనుభవం కూడ ముఖ్యమైన విషయమే. ఏ జీవితానికయితే సిద్ధాంతాన్ని అన్వయిస్తున్నామో ఆ జీవితాన్ని అనుభవించిన వాళ్ళయితేనే ఆ పని సమర్థవంతంగా చేయగలరు. ఇతరులు వాళ్ళు చూపించిన తరువాతే గ్రహించగలుగుతారు. (ఇతరులు గ్రహించనేలేరనిగానీ జీవిత అనుభవం నుండి పుట్టిన సిద్ధాంతం తార్కిక విమర్శకూ విషయ నిబద్ధమైన పరిశీలనకూ అతీతం అనిగానీ భావించనవసరం లేదు). అందుకే ఉద్యమ నాయకత్వంలోనూ మేధోరంగంలోనూ విభిన్న (ముఖ్యంగా పీడిత) జీవిత అనుభవాల నుండి వచ్చిన వ్యక్తులు ఉండడం అవసరం. అందుకే ఉద్యమ నాయకత్వంలోనూ మేధోరంగంలోనూ కూడా ఎవరు ఉన్నారు అన్న ప్రశ్న వేసుకోవడం ఏం చేస్తున్నారన్న ప్రశ్నేకాదు- ముఖ్యమైనది, న్యాయమైనది.

వామపక్ష దృక్పథం సిద్ధాంతాన్ని కేవలం తర్కానికి సంబంధించిన విషయంగా భావించిందని కాదు. తర్కంతో బాటు ఆచరణ కూడ ముఖ్యమైనదనే వామపక్షవాదులు భావించారు. కానీ ఇక్కడ ఆచరణ అనేది కేవలం రాజకీయ ఆచరణ. దానికి ఎంత పెద్ద పీట వేసినా (తర్కబలంకన్నా పుస్తక పరిజ్ఞానం కన్నా రాజకీయ ఆచరణ సిద్ధాంత ఆవిష్కరణకు ముఖ్యమన్న అభిప్రాయం కమ్యూనిస్టు సంప్రదాయంలో బలంగా ఉంది. తరచుగా పుస్తక పరిజ్ఞానాన్నీ తర్కబద్ధమైన ఆలోచనా రీతినీ తృణీకరించే అతివాద రూపం కూడ తీసుకుంటుంది) అది ఈ ప్రశ్నకు సమాధానం కాదు. ఎందుకంటే రాజకీయ ఆచరణ సిద్ధాంతాన్ని అనుసరించే ఉంటుంది. సిద్ధాంతం చూపించే వెలుగులోనే సాగుతుంది. ఆ వెలుగులో అది సిద్ధాంతాన్ని పరిపుష్టం చేయగలదు గానీ కొత్తదానికి బాటవేయలేదు. పూర్తిగా సంప్రదాయ


**సిద్ధాంతం-ఆచరణ అనే రెండే కాకుండా సిద్ధాంతం-ఆచరణ-జీవిత అనుభవం అనే మూడూ అవసరం- అప్పుడు ఆచరణలో కూడ సిద్ధాంతం (అప్పటిదాకా) లేని నవ్యత ఉండగలదు. సిద్ధాంతాన్ని కేవలం రాశిలోనే కాక గుణాత్మకంగనూ పరిపుష్టం చేయగలదు.**



విరుద్ధమైన ఆచరణ అయితే తప్ప సిద్ధాంతంలో కొత్తదనం జీవిత అనుభవం నుండి మాత్రమే రాగలదు. అందువల్ల సిద్ధాంతానికి కొత్తదనం అందివ్వగల జీవిత అనుభవం ఉన్నవారు సిద్ధాంత వేత్తల రంగంలో ఉండాలి. సిద్ధాంతం-ఆచరణ అనే రెండే కాకుండా సిద్ధాంతం-ఆచరణ-జీవిత అనుభవం అనే మూడూ అవసరం- అప్పుడు ఆచరణలో కూడ సిద్ధాంతం (అప్పటిదాకా) లేని నవ్యత ఉండగలదు. సిద్ధాంతాన్ని కేవలం రాశిలోనే కాక గుణాత్మకంగనూ పరిపుష్టం చేయగలదు.

కానీ, నాయకత్వ స్థానంలో ఎవరున్నారు అన్న ప్రశ్న దగ్గరే చర్చను ఆపేస్తే ఈ కొత్త ఉద్యమాల నుండి మనంనేర్చుకోగలిగినదంతా నేర్చుకున్నట్టు కాదు. ఇప్పటికి అలవాటయిన వామపక్ష సిద్ధాంత దృక్పథంలోనే కొన్ని నమస్యలున్నాయన్నవిషయాన్ని గుర్తించనివాళ్ళం అవుతాం.

ఈ కొత్త ఉద్యమాలలో ఒక్కొక్కటీ సంప్రదాయక అభ్యుదయ రాజకీయ దృక్పథం కళ్ళకు ఎందుకు కనిపించకుండ పోయిందో కొంచెం పరిశీలిద్దాం. నాయకత్వంలో ఉన్నవారి పరిమితులు ఒక కారణం. అయితే సిద్ధాంత దృక్పథంలోనే ఏమైనాలోపాలున్నాయేమో చూద్దాం. సారా వ్యతిరేక మహిళాపోరాటాన్ని మొదట తీసుకుందాం. ఎం.ఎల్ పార్టీలు అంతకు ముందే సారావ్యతిరేక ఉద్యమాలు నడిపాయి. ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీ వికృత రూపం తీసుకోవడం, సారాయితాగే అలవాటును ప్రభుత్వమే తన రెవిన్యూ అవసరాలకోసం వ్యాపింపచేయడం, సారా కాంట్రాక్టర్ల లాభాలు పెరిగి అదొక పెద్ద రౌడీ వ్యాపారంగా మారడం, వారు రాజకీయాలలో ప్రముఖ స్థానానికి ఎగబాకడం,పేదకార్మికులు మరింతగా సారాయికి బానిసలు కావడం- ఈ క్రమాన్ని మొదట గుర్తించిందీ దానికి వ్యతిరేకంగా ఉద్యమించినదీ ఎం-ఎల్ పార్టీలు. మొదట సారాయి ధర తగ్గింపుకోసం ఆందోళన చేసి ప్రజల చేత తిట్లు తిన్నారు. ఆ తరువాత సారా నిషేధం కోసం ఆందోళన చేసారు. అయితే ఈ కృషి మొత్తం, పెట్టుబడిదారీ శ్రమ దోపిడీనీ కార్మిక పోరాటాలనూ కేంద్రం చేసుకున్న కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రాతిపదికన చేసారు. ఆ సిద్ధాంత దృష్టికి, పెరుగుతున్న సారాయి వ్యాపారం కార్మికుల కష్టార్జితాన్ని కాంట్రాక్టర్లూ, ప్రభుత్వమూ కలిసి దోచుకునే దోపిడీ ప్రక్రియగా కనిపించింది. అసలు బాధితులు ఆ కార్మికుల భార్యాబిడ్డలన్న విషయం గమనంలోకి రాలేదు. గమనంలోకి వచ్చినా అది సానుభూతి స్థాయిలోనే తప్ప రాజకీయ స్థాయిలో కాదు. రాజకీయంగా, తన జీతమంతా తాగి వృధా చేసుకుంటున్న కార్మికుడే ఈ సారాయి ప్రహసనంలో ప్రధాన బాధితుడిగా కనిపించాడు. అందువల్లే సారాయి ధర తగ్గించడం కోసం ఆందోళన చేయడం వారికి సాధ్యం అయింది. 'మా భర్తల చేత ఇంకింత తాగించడమా మీ ఉద్దేశ్యం' అని కార్మికుల భార్యలు నిలదీసేదాకా తాము చేస్తున్న తప్పేమిటో ఆ పార్టీలకు అర్థం కాలేదు. కానీ ఆ తరువాత కూడా వాళ్ళు అసలు బాధితులను ఆర్గనైజ్ చేసుకొని ప్రభుత్వంతో పాటు, సారా కాంట్రాక్టర్‌తో పాటు, సంపాదించినదంతా తాగి తమ జీవితాలను నాశనం చేస్తున్న శ్రామిక పురుషులు కూడ ఈ పోరాటంలో వైరిపక్షమేనని ప్రకటించేదాకా అర్థం కాలేదు.




**చాలా కాలంగా ఆదివాసులలో పునాది ఉన్న ఏ కమ్యూనిస్టు పార్టీకూడ '1 ఆఫ్ 70' పోరాటాన్ని అదే స్థాయిలో ఎందుకు చేపట్టలేకపోయిందనేది ప్రశ్న.**

ఆ పార్టీల నాయకులంతా మగవాళ్ళేనన్న విషయం అటుంచి, ఫ్యాక్టరీలో మిషన్లు తిప్పే మగ (అత్యధికంగా) కార్మికులను 'కార్మిక వర్గం' అనే భావనకు కేంద్రం చేసుకుని, ఆ కార్మికులు లోనయ్యే శ్రమదోపిడీని సమాజంలోని ప్రధాన అణచివేత రూపంగా భావించి, ఆ కార్మికుల రాజకీయ చొరవను ఆర్గనైజ్ చేయడం తన ప్రధాన కర్తవ్యంగా పెట్టుకున్న సిద్ధాంతానికి ఈ దృష్టి సహజంగా రాగలిగేదా?

ఏజెన్సీ గిరిజనుల 1 ఆఫ్ 70 పోరాటం మరొక ఉదాహరణ. అది పశ్చిమ గోదావరి జిల్లాలో ముందుకొచ్చిన తరువాత ఒక్క సిపిఐని మినహాయించి తక్కిన అన్ని వామపక్ష శక్తులూ ఏదో ఒక మేరకు దానికి మద్దతుగా స్పందించాయి. కానీ చాలా కాలంగా ఆదివాసులలో పునాది ఉన్న ఏ కమ్యూనిస్టు పార్టీకూడ '1 ఆఫ్ 70' పోరాటాన్ని అదే స్థాయిలో ఎందుకు చేపట్టలేకపోయిందనేది ప్రశ్న. కమ్యూనిస్టు నాయకులలో ఆదివాసీలు లేకపోవడం దీనికొక కారణం అనేది నిజమే కావచ్చు. కానీ సిద్ధాంతం కూడ ప్రతిబంధకంగా పనిచేసిందా ? తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆదివాసీలు-ఇతరులు అని వర్గీకరించుకొని అడవిభూమి ఆదివాసీలకే చెందాలని విశ్వసించే దృక్పథానికీ, శ్రామిక రైతాంగాన్ని జాతి, కులం, మతాలకు అతీతంగా ఐక్యపరచి రాజ్యంతో అధికారంకోసం తలపడాలని భావించే దృక్పథానికీ తేడా ఉంటుంది. రెండవ దృక్పథం '1 ఆఫ్ 70' సమస్యను ఒక న్యాయమైన సమస్యగా గుర్తించగలుగుతుంది- కానీ ఒక పరిమితిలోనే. ఆ సమస్య గురించి మరీ ఎక్కువ ఆందోళన చేస్తే అది రైతాంగంలో గిరిజన- గిరిజనేతర విభేదాలను పెంచి అనైక్యతకు దారి తీయగలదు. అందుకు భిన్నంగా, రాజ్యం యాజమాన్యంలో ఉన్నఅటవీ భూములపైన కమ్యూనిస్టు పార్టీలు-ముఖ్యంగా ఎం-ఎల్ పార్టీలు పెద్ద పోరాటాలు నిర్వహించాయి. వాటి పుణ్యాన ఆదివాసీలుమన రాష్ట్రంలో కనీసం 4 లక్షల ఎకరాల అడవి భూమి అనుభవిస్తున్నారు. కానీ, '1 ఆఫ్ 70' పోరాటం మాత్రం ఆదివాసీలే చేపట్టిన ఉద్యమాలలో ముందుకొచ్చినంత బలంగా ఏ కమ్యూనిస్టు గిరిజన ఉద్యమంలోనూ రాలేదు. రిజర్వ్ ఫారెస్ట్ భూముల కోసం పోరాటం చేసినంత పట్టుదలగా గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న ఆదివాసీ భూములపైన కూడపోరాటం చేయడం సాధ్యమవుతుందనీ దానికి తగిన పోరాట రూపాలు ఆవిష్కరించడం సాధ్యమేననీ ఆదివాసీనే నేర్పవలసి వచ్చింది. సామాజిక మార్పును ఏవిధంగా అర్థం చేసుకుంటామన్నది


ఇక్కడ కీలకమైన విషయం. విభిన్న సామాజిక జీవిత రంగాలలో ఎక్కడికక్కడ (అంటే సంబంధం లేకుండా అని కాదు) అభ్యుదయకరమైన మార్పు వస్తుందనీ, ఆ మార్పులను సమన్వయపరచి ముందుకు తీసుకుపోవాలనీ భావించడం ఒక దృక్పథం. అందుకు భిన్నంగా, ఒక ప్రధానమైన పరిణామక్రమాన్ని (ఉదాహరణకు కార్మిక వర్గపోరాటాన్ని) మార్పుకు భూమికగా భావించి దానిని ప్రాతిపదిక చేసుకుని ఇతర రంగాలలో జరిగే మార్పును అర్థం చేసుకోవాలనుకోవడం సాధించాలనుకోవడం సంప్రదాయక వామపక్ష దృక్పథం. ఈ రెండవ దృక్పథం తాను భూమికగా భావించే పరిణామక్రమాన్ని సాధించడానికి అవసరమైన వ్యూహాలనూ, విశ్లేషణనూ అభివృద్ధి చేయడంలో నిమగ్నం అయి ఉంటుంది. దాని దృష్టి అక్కడే 'ఫోకస్' అయి ఉంటుంది. ఆ పరిణామక్రమానికి ఆటంకం కలిగించే ఆకాంక్షలు- అవి ఎంత న్యాయమైన ఆకాంక్షలయినా- దాని కళ్ళకు సులభంగా కనిపించవు, కనిపించినా దాని ఆమోదం పొందవు. ఇది సిద్ధాంత సంబంధమైన ప్రతిబంధకం. శ్రమదోపిడీకి శ్రామికులంతా ఒకటై ఒక బలమైన ఐక్యశక్తిగా పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాలతోనూ వారి వర్గ రాజ్యంతోనూ తలపడి తమ రాజ్యాన్ని నెలకొల్పాలన్న వ్యూహానికీ ప్రోగ్రాంకూ ప్రాధాన్యతనిచ్చే వామపక్ష దృక్పథం కళ్ళకు దళిత ఉద్యమం ఐక్యతను చీల్చే విచ్ఛిన్నకరవాదంగా కనిపిస్తుంది. స్త్రీలు స్త్రీలుగా అనుభవించే అణచివేత గురించి మాట్లాడడం శ్రామిక వర్గంలో నిలువుగా చీలిక తీసుకొచ్చే వాదనగా కనిపిస్తుంది. అందువల్ల ఆ సిద్ధాంతానికి ఈ సమస్యలు వాటి పర్యవసానమైన ఆకాంక్షలూ - ఆ ప్రజలే వేలెత్తి చూపించేవరకు కనిపించవు, కనిపించినా వెంటనే ఆదరణ పొందవు. కాలక్రమంలో తొలినాటి ద్వేషభావం తగ్గినప్పటికీ-ఒకమేరకు సంఘీభావం, సమైక్య ఆచరణ పెరిగినప్పటికీ- ఏదో ఒక పరిణామక్రమమే సామాజిక మార్పుకు భూమిక అన్న అభిప్రాయం ఉన్నంతకాలం దానికి అడ్డం వచ్చినట్టు కనిపించే ఇతర పరిణామక్రమాల పట్ల వైరిభావం పోదు. వాటన్నిటినీ తన నాయకత్వంలో ముందుకు నడిపించడం అటుంచి, వాటితో పూర్తిస్థాయి సంఘీభావం కూడ సాధ్యం కాదు.

దళితఉద్యమం ఆవిర్భావంతో కమ్యూనిస్టులు ఎదుర్కొన్న ఈ సమస్యను, మాదిగ హక్కుల పోరాటం ముందుకు రావడంతో దళిత ఉద్యమం కూడ ఎదుర్కొనింది. ఇక్కడ కూడ దళిత ఉద్యమ నాయకులలో అత్యధికులు ఒక కులానికే (మాల కులానికి) చెందినవారన్నది మాదిగల సమస్యను చూడలేకపోవడానికి ఒక కారణం అని గుర్తించడం ఎంత ముఖ్యమో దళిత ఉద్యమానికి ఉన్న సిద్ధాంత దృక్పథం నుండి వచ్చిన అవరోధాలను చూడడం కూడ అంతే ముఖ్యం. అఖండమైన, బలమైన, దళిత ఐక్యతకు ఈ దృక్పథంలో కేంద్రస్థానం ఉంది. ఒక బలమైన భౌతిక శక్తిగా ఐక్యమైన దళితులు బహుజనకులాలను తమతో కలుపుకొని (కమ్యూనిస్టు సిద్ధాంతంలో ఒక బలమైన భౌతిక శక్తిగా ఐక్యమైన కార్మికులు మధ్యతరగతినీ, రైతాంగాన్నీ తమతో కలుపుకున్నట్టు) అగ్రవర్ణ ఆధిక్యతను సవాలు చేసి దళిత బహుజన సమాజాన్ని (లేక రాజ్యాన్ని) నెలకొల్పాలనే దృక్పథం దళిత రాజకీయాలలో బలంగా ఉంది. ఈ రాజకీయ క్రమం దళిత రాజకీయాల దృష్టిలో పురోగమనానికి ప్రధాన భూమికగా ఉంది. దీనిని 'విచ్ఛిన్నం' చేసే మాదిగల ఆకాంక్ష ఆ సిద్ధాంత దృక్పథానికి సులభంగా కనిపించదు. కనిపించినా వెనువెంటనే ఆదరణ పొందదు. మాదిగల నుండే ఆ ఉద్యమం రావలసి వచ్చింది.

సారాంశంలో, ఏదో ఒక పరిణామక్రమానికి కేంద్రస్థానం ఇచ్చి, దానినే ప్రగతికి భూమికగా భావించే ఏ రాజకీయ దృక్పథమైనా ఇతర పరిణామ క్రమాలకు నాయకత్వం వహించకపోగా (వహించాలని సిద్ధాంతపరంగా భావించినప్పటికీ) వాటిపట్ల అనుమానంతో, సందేహంతో, వ్యవహరించటమే జరుగుతుంది. అటువంటప్పుడు ఆ పరిణామక్రమాలు తమను తాము గుర్తించుకోవలసిందే, తమను తాము ఆవిష్కరించుకోవలసిందే. సమాజంలోని అన్ని సమస్యలకూ మూలమైన భూమిక ఒకటి ఉందనీ, దానిని గుర్తించి ఆ వెలుగులో అన్ని సమస్యల పరిష్కారానికీ బాటవేయగల ఒక పునాది పరిణామక్రమాన్ని ప్రతిపాదించడం, దాని చుట్టూ రాజకీయ వ్యూహాలను రూపొందించడం, ప్రగతి కాముకుల కర్తవ్యమనీ భావించే 'శాస్త్రీయ'దృక్పథాల కళ్ళకు కనిపించని విషయాలు, కనిపించినా ఆదరణ పొందని విషయాలూ ఎప్పుడూ ఉంటాయి. అవి అప్రధానమైనవిగా, అశాస్త్రీయమైనవిగా, ఒక్కోసారి రాజకీయ కుట్రలుగా, కనిపిస్తాయి. ఈ 'శాస్త్రీయత' ను గుండెకాయగా కలిగి ఉన్న 'ఆధునికత' దృక్పథం మీద 'ఆధునికాంతరవాదం' (పోస్ట్-మోడర్నిజం) పెట్టే విమర్శ ఈ మేరకు సబబయినదే. సబబయినదనే మనం చర్చిస్తున్న కొత్త ఉద్యమాలతో పాత ఉద్యమాలు, పాత ఉద్యమ సిద్ధాంతాలు ఎదుర్కొన్న సమస్యలు రుజువు చేస్తున్నాయి.

'మూలంలోకి పోయి అంతిమ పరిష్కారానికి బాటవేసే వ్యూహాలను రచించడం' అనే ఈ శాస్త్రీయత అన్ని సమస్యలకూ పరిష్కారం ఇవ్వకపోగా తాను నిర్వచించే బాటలోలేని సమస్యలు మన కళ్ళకు కనిపించకుండ చేస్తుందని గుర్తించిన తరువాత ఒక ఇబ్బంది పెట్టే ప్రశ్న మిగులుతుంది. 'శాస్త్రీయ దృక్పథం' మనకు అన్ని విషయాలూ తెలుపుతుందని అనుకుంటాం. ఒకేసారి అన్నీ తెలిసిపోకపోయినా కాలక్రమంలో తెలుస్తాయని అనుకుంటాం. కానీ 'మూలం' లోకి పోయి 'అంతిమ పరిష్కారాన్ని' ఆవిష్కరించే 'శాస్త్రీయత' స్వభావరీత్యానే అనేక విషయాలు (ఆ మూలానికి చెందినవి) మనకు తెలియకుండ చేస్తుందని గుర్తించడం చాల ఇబ్బంది పెట్టే


**ఏదో ఒక పరిణామక్రమానికి కేంద్రస్థానం ఇచ్చి, దానినే ప్రగతికి భూమికగా భావించే ఏ రాజకీయ దృక్పథమైనా ఇతర పరిణామ క్రమాలకు నాయకత్వం వహించకపోగా (వహించాలని సిద్ధాంతపరంగా భావించినప్పటికీ) వాటిపట్ల అనుమానంతో,సందేహంతో, వ్యవహరించటమే జరుగుతుంది.**



విషయం. అప్పుడింక శాస్త్రీయత అనే భావననే వదిలిపెట్టాలా ? శాస్త్రీయత అనే భావన ఒక ఆధిపత్య భావన అనుకోవాలా?పోస్ట్-మోడర్నిస్టులు తరచుగా అదే విధంగా వాదిస్తారు. కానీ అంతటి అతివాదానికి పోవాలా ? శాస్త్రీయతకు (సామాజిక విషయాలలో) వేరే అర్థం ఇచ్చుకోలేమా? ఇచ్చుకొని ఆ భావనను రెండు రకాల అతివాదం నుండి కాపాడుకోలేమా ?దీనికి జవాబు వెతికే ముందు ఇంకొక రెండు విషయాలు చూద్దాం.

సంప్రదాయక వామపక్ష సిద్ధాంత దృక్పథంలో ప్రజల చైతన్యానికి ముఖ్యస్థానం ఉంది. భౌతిక పరిస్థితులలో రాగల మార్పులను, ఆ మార్పుల వల్ల ప్రయోజనం పొందే ప్రజలు గుర్తించి చైతన్యవంతులయి, దాని సాధనకోసం పోరాటం చేయాలనీ, చేస్తారనీ ఆ సిద్ధాంతం నమ్ముతుంది. ఇక్కడ 'చైతన్యం' అనే దానిలో ప్రధానమైన విషయం రాజకీయ చైతన్యం. తమ సమస్యలకు మూలమేమిటో గుర్తించడం, శ్రామిక రాజ్యాధికారంలోనే దానికి పరిష్కారం ఉందని గుర్తించడం, ఐక్య శ్రామిక చైతన్యాన్ని పొందడం దీనిలోని ముఖ్య విషయాలు. దానిలో భాగంగా, తమను తాము శ్రామికులుగా గుర్తించుకొనిఆత్మవిశ్వాసాన్నిపెంపొందించుకోవడం

**సంప్రదాయక వామపక్ష సిద్ధాంత దృక్పథంలో ప్రజల చైతన్యానికి ముఖ్యస్థానం ఉంది. ఇక్కడ 'చైతన్యం' అనే దానిలో ప్రధానమైన విషయం రాజకీయ చైతన్యం.**



అనే అంశం కూడ ఉంటుంది. ఇప్పుడు కొత్తగా ముందుకొస్తున్న స్త్రీల, ఆదివాసీల, శ్రామిక కులాల ఉద్యమాలు, చైతన్యం అనేదానికి వేరే అర్థం ఇస్తున్నాయి. భిన్న జీవిత అనుభవాల ప్రాతిపదికన మాదిగ, చాకలి, వడ్డెర, కోయ తదితర ప్రజానీకం వేదికలు, ఉద్యమాలు ముందుకొచ్చాయి. ఈ ఉద్యమాలిచ్చే చైతన్యం అనిర్దిష్టమైన శ్రామిక చైతన్యం కాదు.నిర్దిష్టంగా ఆ కులానికి చెందిన ప్రజల జీవిత అనుభవం నుండి పుట్టి, సామాజిక సంచలనం సృష్టించడంలోనూ సామాజిక జీవితాన్ని సాధ్యం చేయడంలోనూ తాము నిర్వహించిన పాత్రను గుర్తింపచేసే నిర్దిష్టమైన చైతన్యం. ఈ స్వీయజ్ఞానం అనిర్దిష్టమైన శ్రామిక వర్గ చైతన్యం కన్నా లోతయినది, నిండయినది. అది ఇచ్చే ఆత్మవిశ్వాసం బలమైనది. అది చైతన్యం దగ్గర ఆగిపోకుండ కొత్త జ్ఞానాన్ని- వారి నిర్దిష్టమైన జీవిత అనుభవం నుండి పుట్టిన జ్ఞానాన్ని సృష్టించగలదు. ఒక కొత్త రాజకీయ సమీకరణకే కాక, కొత్త మేధావివర్గం ఆవిర్భావానికి కూడా అది దారి తీయగలదు. అందులో రాజ్యాధికారసాధనకు అవసరమైన రాజకీయ చైతన్యం కంటే ఆయా ప్రజల నిర్దిష్ట జీవిత అనుభవం నుండి పుట్టిన విలువల చైతన్యమే ముఖ్యమైనది కావచ్చు. అయితే దానికి ఉన్న నిర్దిష్టత కారణంగా అది వివిధ శ్రామిక ప్రజల మధ్యన ఐక్యతకు వెంటనే దోహదం చేయకపోవచ్చు. అది ప్రత్యేకతల ప్రాతిపదికన జరుగుతున్న సమీకరణ. దానికి ఐక్యత అసాధ్యం కాదు- అనవసరం ఎంతమాత్రం కాదు- కాని అది 'శ్రమ'అనే అనిర్దిష్టమైన భావన ప్రాతిపదికన జరిగే అఖండమైన భౌతిక ఐక్యత కాదు. నిర్దిష్టమైన ప్రత్యేక జీవిత అనుభవాలలోని సామాన్య విలువల ప్రాతిపదికన సాధ్యం కాగల సంఘీభావం, సమైక్య ఆచరణ. అది రాజ్యాధికార సాధనకు ఎంత వరకు ఉపయోగపడుతుందో తెలీదు. కానీ నూతన సమాజపు పునర్నిర్మాణానికి అవసరమైన నిండైన విలువలు ఇవ్వగలదు. ప్రకృతికీ మనిషికీ ఉండవలసిన పరస్పరతా సంబంధాన్ని ఆదివాసీల జీవన విలువల నుండి నేర్చుకోగలం. 'శ్రామికులు' అనే అనిర్దిష్టమైన భావన మనకది నేర్పదు. వ్యక్తిగత సంబంధాలలో పెత్తనాన్నీ ఆధిపత్యాన్నీ తిరస్కరించడం స్త్రీల జీవిత అనుభవం నుండి నేర్చుకోగలం. 'శ్రామికులు', 'శ్రమదోపిడీ' అనే అనిర్దిష్టమైన భావననుండి కాదు. ఒక్కొక్క పీడిత ప్రజాసమూహం జీవిత అనుభవం నుండి ఇటువంటి ప్రజాస్వామ్య విలువలు- నిర్దిష్టమైనవి- నేర్చుకోగలము, అవి ఇప్పటికే (ఆ ప్రజల జీవిత అనుభవంలో) ఉనికిలో ఉన్నాయని గుర్తించగలము. వాటి వ్యాప్తికోసం కృషి చేసే సాంస్కృతిక రాజకీయ కృషిని చేపట్టగలం. రాజ్యాధికార సాధనకోసం అవసరమైన శ్రామిక ఐక్యతనూ తత్సంబంధమైన శ్రామిక చైతన్యాన్నీ ప్రధానంగా భావించే సంప్రదాయక వామపక్ష సిద్ధాంత ధోరణి ఈ అవసరాన్ని గుర్తించగలదా ? దాని సిద్ధాంత దృక్పథమే అడ్డం రాదా ? కొంత మేరకు ఈ నిర్దిష్ట జీవిత అనుభవాల వ్యక్తీకరణను సహించినా, అది శ్రామిక ఐక్యతకూ రాజ్యాధికార సాధనకు అవసరం అయిన ఐక్యబలానికి అవరోధంఅవుతుందన్న భయమే ప్రధానంకాదా?

రాజ్యంపట్ల, రాజ్యసార్వభౌమత్వం పట్ల కూడా ఈ కొత్త ఉద్యమాలు ఒక కొత్త వైఖరిని తీసుకొచ్చాయి. రాజ్యాన్ని మొత్తంగా ప్రజల శత్రువుగా భావించడం, దాని సాధికారతను మొత్తంగా తిరస్కరించడం, రాజ్యంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలు, విలువలు బూటకపు సాధికారతను కల్పించే భావజాల సాధనాలు మాత్రమే తప్ప వాటి ద్వారా జీవితాలను బాగు చేసుకునే అవకాశంగానీ, అసమానతలను తొలగించుకునే అవకాశంగానీ పీడిత ప్రజలకు లేదని నమ్మడం అటువంటి అవకాశం ఉందన్న 'అపోహ' ప్రజలలో ఉంటే దానిని తొలగించాలని నమ్మడం, సంప్రదాయక వామపక్ష దృక్పథంలో - ముఖ్యంగా ఎం.ఎల్ పార్టీల దృక్పథంలో- ముఖ్యమైన విషయంగా ఉంది. ఈ కొత్త ఉద్యమాలు దీనిని ఆమోదించడం లేదు. తాము అనుభవిస్తున్న ఆధిపత్యానికి రాజ్యం (చట్టం రూపేణా గానీ చట్ట బాహ్యమైన ఆచరణ రూపేణా గానీ) వత్తాసుగా నిలిచినప్పుడు ఈ ఉద్యమాలు రాజ్యాన్ని ప్రశ్నిస్తున్నాయి, నిలదీస్తున్నాయి. అయితే అదే రాజ్యం కల్పించే ప్రజాస్వామిక అవకాశాలను నిజమైన అవకాశాలుగా స్వీకరించి, ఆధిపత్యాన్ని ఎదుర్కొనడానికి ఆ అవకాశాలను వాడుకుంటున్నాయి. అవి మొత్తంగా రాజ్యం సాధికారతను తిరస్కరించడం లేదు. విమర్శనాత్మకంగా వ్యవహరిస్తూ ఆ సాధికారతను తమ అవసరాలకు అనుగుణంగా మలచుకుంటున్నాయి.

రాజ్యం సాధికారతను మొత్తంగా తిరస్కరించే వామపక్ష- ప్రత్యేకించి సిపిఐ - (ఎంఎల్)సంప్రదాయం నుండి పుట్టిన పౌరహక్కుల ఉద్యమానికి ఈ కొత్త ఉద్యమాల

వైఖరి ఒక సవాలై నిలిచింది. రాజ్యం మొత్తంగా ప్రజల శత్రువే అయితే, రాజ్యంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలు మొత్తంగా బూటకపు సాధికారత కల్పించే సాధానాలయితే, ఆ రాజ్యంలో భాగమైన చట్ట సభలలోనూ, న్యాయవ్యవస్థలోనూ బ్యూరోక్రసీలోనూ తమకు ప్రవేశం కావాలని కోరుకుంటున్న దళితుల కోరికనూ, స్త్రీల కోరికనూ ఏ విధంగా అర్థం చేసుకోవాలి ? ఆ రాజ్యంలో భాగంగానే ప్రత్యేక రాష్ట్రం కావాలన్న తెలంగాణ ఉద్యమకారుల కోరికనూ, ఏజెన్సీ ప్రాంతాలకు స్వయంపాలనా అధికారం కావాలన్న ఆదివాసీ ఉద్యమం కోరికనూ ఏ విధంగా అర్థం చేసుకోవాలి. పాలక వర్గంలో చేరిపోవాలని ఆరాటపడుతున్న 'క్రీమీ లేయర్' ప్రయత్నంగా చూడాలా ? లేక రాజ్యం కల్పించే ప్రజాస్వామిక అవకాశాలను వాడుకొని, వాటిని మరింత ప్రజీస్వామికంగా మలచుకొని, తద్వారా సాంఘిక జీవితంలోని అసమానతలనూ ఆధిపత్యాన్నీ ఎదుర్కొనే ఒక న్యాయమైన ప్రయత్నంగా చూడాలా ? ఈ చర్చ ఈ రోజు పౌరహక్కుల ఉద్యమంలో జరుగుతూ ఉంది.

నిజానికి పౌరహక్కుల ఉద్యమమే తన ఆచరణ నుండి సరయిన జ్ఞానాన్ని పెంపొందించి ఉంటే- సంప్రదాయక వామపక్షానికి రాజ్యాన్ని గురించి, ప్రజాస్వామ్యాన్ని గురించి ఉన్న అవగాహనను ప్రశ్నించే 'కొత్త ఉద్యమం' అయి ఉండాలి. రాజ్యానికి సంప్రదాయక వామపక్ష అవగాహనలో సాధికారత కల్పించే సాధనాలలో చట్టబద్ధ పాలన, పౌరహక్కులు, న్యాయవ్యవస్థ, స్వతంత్ర ప్రతిపత్తి ముఖ్యమైనవి. మరి వీటి కోసమే ఆందోళన చేసే పౌరహక్కుల ఉద్యమం ఏం చేస్తూ ఉంది ? బూటకపు సాధికారతను పెంపొందిస్తూ ఉందా ? లేదనుకుంటే, ఆ సాధికారత పూర్తిగా బూటకం కాదనీ, కేవలం భావజాలం కాదనీ, అందులో కొంత సత్యం ఉందనీ పౌరహక్కుల ఉద్యమం చెప్పవలసి ఉంటుంది. పౌరహక్కుల ఉద్యమం ఈ తాత్విక మీమాంసలో కొట్టుమిట్టాడుతున్న సమయంలోనే ఈ కొత్త ఉద్యమాలు దానిని మరింత పెంచాయి. కేవలం చట్టాలు, న్యాయ వ్యవస్థేకాక చట్టసభలు, పరిపాలనా వ్యవస్థలు కూడా ప్రజాస్వామ్య ప్రయోజనాలకు పూర్తిగా పనికి రానివేం కావనీ, వాటిని ఉపయోగించుకోవడం, సంస్కరించుకోవడం పూర్తిగా అసాధ్యమేమీ కాదనీ ఈ ఉద్యమాలు తమ ఆచరణద్వారా ప్రకటిస్తున్నాయి. రాజ్యాన్ని బద్దలు కొట్టి ప్రత్యామ్నాయ (శ్రామిక) రాజ్యాన్ని నెలకొల్పడం అనే కీలకమైన లక్ష్యాన్ని తన ముందుంచుకొని దానికి అనుగుణ్యమైన బలసమీకరణపైన దృష్టి పెట్టే కమ్యూనిస్టు ఉద్యమానికి ఇది సిద్ధాంతపరమైన సవాలే. ఈ ఉద్యమాలతో దానికి సులభంగా సయోధ్య కుదరక పోవడానికీ, తరచుగా అసహనంగా వ్యవహరించడానికీ ఇదీ ఒకకారణమే. అంతకంటే ముఖ్యంగా, ఆధునిక రాజ్యం మొత్తంగా అన్ని రకాల ప్రజాప్రయోజనాలకూ అన్ని రకాల ప్రగతికీ శత్రువు కాదనీ, రాజ్యం ద్వారా సాధించుకోగల ప్రగతి కూడ ఉండగలదనీ, రాజ్యం సార్వాభౌమత్వాన్ని ఎల్లవేళలా సవాలు చేయవలసిన అవసరం ప్రజలందరికీ లేదనీ ఈ కొత్త ఉద్యమాలు నేర్పుతున్న విషయాన్ని సంప్రదాయక కమ్యూనిస్టు సిద్ధాంతం తన అవగాహనలో ఇముడ్చుకోవడం కష్టమే.